ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
మంగళవారం | 24 ఫిబ్రవరి , 2026 | పేజీలు : 05

త్వరగా ఇందిరమ్మ ఇండ్ల పూర్తి

కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

ప్రజాపక్షం/హుజూర్‌నగర్ : ఇందిరమ్మ ఇండ్లు త్వరితగతిన పూర్తి చేసి, త్వరలో ప్రారంభించుటకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. సోమవారం హుజూర్‌నగర్‌లోని రామస్వామి గుట్ట వద్ద ఇందిరమ్మ ఇండ్ల బ్లాక్‌లను కలెక్టర్ పరిశీలించి మాట్లాడారు. రాష్ట్రంలోనే ఇంత భారీ ఎత్తున, ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను నాణ్యతతో నిర్మించాలన్నారు. అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్ సరఫరా అన్ని మౌలిక సదుపాయాలు పూర్తి చేసి ప్రారంభించుటకు సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమం లో ఆర్‌డిఓ శ్రీనివాసులు, హౌసింగ్ పిడి సిద్ధార్థ, హార్టికల్చర్ సెరికల్చర్ పిడి నాగయ్య, తహశీల్దార్ కవిత పాల్గొన్నారు.

భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం

దేశ ప్రయోజనాలకు విరుద్ధం

ప్రధాని వైఖరిపై సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి తీవ్ర విమర్శలు

స్థానిక సంస్థ ఎన్నికలకు సిద్ధం కావాలి

యూరియా యాప్‌ను తొలగించి పాత విధానంలోనే సరఫరా చేయాలి

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

ప్రజాపక్షం/నల్లగొండ: భారత్ అమెరికా మధ్యంతర వాణిజ్య ఒప్పందంలో ప్రధాని నరేంద్ర మోదీ తీసుకున్న వైఖరి దేశ ప్రయోజనాలకు విరుద్ధమని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడి తీవ్రంగా విమర్శించారు.అమెరికా విధించిన సుంకాల విషయంలో కేంద్ర ప్రభుత్వం గట్టి వైఖరి అవలంబించలేదని, ఇది దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపిందన్నారు.సోమవారం నల్లగొండలోని పార్టీ జిల్లా కార్యాలయం మాగ్దూమ్ భవన్‌లో జరిగిన సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని ధోరణి,లొంగుబాటు రాజకీయాల వల్ల వాణిజ్య ఒప్పందం దేశానికి అగ్నిపరీక్షగా మారిందని పేర్కొన్నారు.ఈ ఒప్పందం కారణంగా దేశీయ పరిశ్రమలు దెబ్బతినే ప్రమాదం ఉందని,ముఖ్యంగా రైతులు మరియు చిన్న వ్యాపారులు నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు.దిగుమతులకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం వల్ల స్థానిక ఉత్పత్తులకు మార్కెట్ తగ్గిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో జరగబోయే ఎంపీటీసీ,జెడ్‌పిటీసీ ఎన్నికల్లో అధిక స్థానాల్లో పోటీ చేసి విజయాలు సాధించే దిశగా పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.గత సర్పంచ్,మున్సిపల్ ఎన్నికల్లో సిపిఐ మంచి విజయాలు సాధించిందని,అదే స్ఫూర్తితో రాబోయే ఎన్నికల్లో కూడా అధిక స్థానాలు కైవసం చేసుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలతో వ్యవసాయ సాగు కోసం రైతులకు సబ్సిడీపై అందించే యూరియా యాప్ విధానం అమలు చేయడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.యూరియా యాప్‌పై పూర్తి స్థాయిలో అవగాహన లేకపోవడంతో ఎరువు పొందడంలో రైతులు తీవ్ర కష్టాలు పడుతున్నారని ఆందోళన వ్యక్తం ఇప్పటికైనా రైతులు ఇబ్బందులను పరిగణలోకి తీసుకొని పాత విధానంలోనే పారదర్శకంగా,అక్రమాలకు తావు లేకుండా యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి పబ్బు వీరాస్వామి అధ్యక్షత వహించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహారెడ్డి, రాష్ట్ర నాయకులు ఉజ్జిని రత్నాకర్ రావు, జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్ రెడ్డి, లోడంగి శ్రావణ్ కుమార్,కార్యవర్గ సభ్యులు ఉజ్జని యాదగిరిరావు, నర్సింహా,బంటు వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు, రామలింగయ్య పాల్గొన్నారు.

వ్యవసాయ రంగానికి నిరంతర విద్యుత్తే లక్ష్యం

ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి : వ్యవసాయ రంగానికి గృహ అవసరాలకు నిరంతర విద్యుత్తు నిరంతరంగా విద్యుత్తు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మరోసారి స్పష్టం చేశారు. పోచంపల్లి మండలం దోతిగూడెం గ్రామంలో సోమవారం 33/11 కేవీ విద్యుత్ నూతన సబ్‌స్టేషన్ ప్రారంభించి మాట్లాడారు. అనంతరం ఆయన సిఎస్ఆర్ ఎజోలా కంపెనీ రూ.90 లక్షల ఆర్థిక సహకారం, గ్రామ సర్పంచ్ గుమి జంగారెడ్డి దానం చేసిన ఎకరం భూమిలో నిర్మించ తలపెట్టిన ఫంక్షన్ హాల్ శంకుస్థాపన చేశారు. మహిళా సంఘ బంధ భవనం, సిసి రోడ్డు ఎన్ఆర్ ఈజీఎస్ ఇందిరమ్మ ఇండ్లు ప్రారంభించారు. పోచంపల్లి మండల వ్యాప్తంగా 79 మందికి కళ్యాణ లక్ష్మి , ఒకరికి షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. పోచంపల్లి మున్సిపాలిటీ చైర్మన్ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్స్ వివిధ గ్రామాల సర్పంచులు మండల రెవెన్యూ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ తహసిల్దారు నాగేశ్వరరావు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ వెంకట్ రెడ్డి, ఎలక్ట్రిసిటీ చౌటుప్పల్ డిఈ మల్లికార్జున, డిఈ భువనగిరి టిఎస్ సుధీర్ కుమార్ పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులపై సత్వరమే చర్యలు

జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : ప్రజావాణి ఫిర్యాదులపై అధికారులు సత్వరమే చర్యలు తీసుకొని పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. వివిధ శాఖలలో చాలా కాలం పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులపై శాఖల వారీగా ప్రత్యేక శ్రద్ధ పెట్టి పరిష్కరించాలని తెలిపారు. అలాగే రాష్ట్రస్థాయి ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులను కూడా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 99 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె సీతారామారావు, మహిళా శిశు సంక్షేమ అధికారి కె నరసింహారావు, జిల్లా ఎస్‌సి సంక్షేమ శాఖ అధికారిణి దయానంద రాణి, డిఇఓ అశోక్ ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

వృద్ధురాలిని నడిరోడ్డుపై వదిలేశారు...

కలెక్టర్ ముందు గోడును వెల్లబోసుకున్న వృద్ధురాలు..

స్పందించిన కలెక్టర్...

భూమిని తిరిగి ఎవరు అమ్ముకోలేకుండా బ్లాక్ లిస్టులో పెట్టాలని ఆదేశం

ప్రజాపక్షం/యాదాద్రి : కన్నతల్లిలా చూసుకోవాల్సిన కోడళ్లు ఆ వృద్ధురాలిని నడిరోడ్డుపై వదిలేశారని ఆస్తులు పంచుకుని, తనను అనాథను చేశారని ఓ వృద్ధురాలు ఆవేదన వ్యక్తం చేసింది. వయసు మళ్ళిన కాలంలో అండగా ఉండాల్సిన వారే గడప దాటించడంతో, 81 ఏళ్ల వృద్ధురాలు న్యాయం కోసం జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించింది. సోమవారం భువనగిరి కలెక్టరేట్లో జరిగిన ప్రజావాణిలో ఆమె జిల్లా కలెక్టర్ హనుమంతరావును కలిసి గోడు వెల్లబోసుకుంది. వివరాల్లోకి వెళితే.. యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం, రామారం గ్రామానికి చెందిన మర్రిపెల్లి సుగుణమ్మ అనే వృద్ధురాలికి ముగ్గురు కొడుకులు. భర్త అంజయ్య 2008లో మరణించగా, కాలక్రమేణా ముగ్గురు కొడుకులు కూడా మృతి చెందారు. అయితే గత 12 ఏళ్లుగా ఆమె కోడళ్లు ఆమెను సరిగా చూసుకోవడం లేదని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు.

ఇంటి నుంచి వెలివేత..

కోడళ్లు ముగ్గురూ కలిసి తనను ఇంటి నుండి వెళ్ల గొట్టారని, వానలో, చలిలో గ్రామ బస్టాండ్ వద్ద ఎన్నో రోజులు అవస్థలు పడ్డానని సుగుణమ్మ తన లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుతం ఆమె కుమార్తెలు, అల్లుళ్లు ఆమెకు ఆశ్రయం కల్పించి పోషిస్తున్నారు. పెద్దమనుషుల సమక్షంలో పంచాయతీ పెట్టిన కోడళ్ల ప్రవర్తనలో మార్పు రాలేదని ఆమె తెలిపారు.

భూమి కోసం పోరాటం..

తనకు, తన భర్తకు చెందిన భూమిని కోడళ్లు పంచుకుని అనుభవిస్తున్నారని, కానీ తనకు అందాల్సిన కొత్త పట్టాదారు పాసు పుస్తకం ఇప్పటివరకు రాలేదని ఆమె వాపోయారు. భర్త పేరిట ఉన్న సుమారు 1.22 ఎకరాలు, తన పేరిట ఉన్న 1.32 ఎకరాల భూమికి సంబంధించి 'భూ భారతి' రికార్డుల్లో పేరు నమోదు చేయించి, తనకు పాస్ పుస్తకం ఇప్పించాలని ఆమె కోరుతున్నారు.

స్పందించిన జిల్లా కలెక్టర్....

ఈ విషయంపై స్పందించిన కలెక్టర్ హనుమంతరావు వెంటనే గుండాల తహసీల్దారుతో మాట్లాడారు. తన భర్త పేరు ఉన్న భూమిని వృద్ధురాలు పేరు మీదకి మార్చాలని, ఆ మార్చిన భూమిని తిరిగి ఎవరు అమ్ముకోలేకుండా బ్లాక్ లిస్టులో పెట్టాలని ఆదేశించారు.

తహసీల్దార్ కార్యాలయం మార్పు

ప్రజాపక్షం/చౌటుప్పల్ : చౌటుప్పల్ ఎమ్మార్వో కార్యాలయం నూతన భవనానికి మారినట్లు తహసిల్దార్ వీరబాయి తెలిపారు. పద్మావతి ఫంక్షన్ హాల్ పక్కన ఏర్పాటు చేసిన కొత్త కార్యాలయంలో నేటి నుంచి సేవలు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. రెవెన్యూ పనుల కోసం వచ్చే ప్రజలు రైతులు పాత భవనానికి కాకుండా కొత్త భవనానికి రావాలని సూచించారు. ప్రజలు మార్పును గమనించి అధికారులకు సహకరించాలని కోరారు.

ఆర్థిక సహాయం అందజేత

ప్రజాపక్షం/రామన్నపేట : రామన్నపేట మండల పరిధిలోని ఇంద్రపాలనగర్ గ్రామానికి చెందిన రాదారపు ఆగమ్మ అకాల మరణం చెందగా వారి మృతుదేహానికి గ్రామ సర్పంచ్ గర్ధాస్ విక్రమ్, యువనాయకులు సింగణబోయిన గణేష్ యాదవ్ పూలమాలలు వేసి నివాళులు అర్పించి రూ.5000 ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నల్ల జయసుధ స్వామి, కాటపల్లి యాదయ్య, మందడి విధ్యాసాగర్ రెడ్డి, రాస వెంకటేష్, మందడి శ్రీధర్ రెడ్డి, రవ్వనర్సింహా పాల్గొన్నారు.

ఉచిత మెగా ఆరోగ్య శిబిరం

ప్రజాపక్షం/రామన్నపేట : ఈనెల 27న రామన్నపేట మండల పరిధిలోని ఏన్నారం గ్రామంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో యశోద హాస్పిటల్ సహకారంతో ఉచిత మెగా ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించడంతోపాటు రక్త దాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పనకంటి భాస్కరరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మెగా ఆరోగ్య శిబిరంలో గ్రామీణ ప్రజలకు అన్ని రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఎన్నారం గ్రామ ప్రజలతోపాటు పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

దేశ సంపదను అమెరికాకు తాకట్టు పెడుతున్న మోడీ

ప్రజాపక్షం/రామన్నపేట : ప్రపంచ దోపిడీదారి అమెరికాకు భారత సంపదను నరేంద్ర మోడీ ప్రభుత్వం తాకట్టు పెడుతూ దేశ సార్వభౌమత్వాన్ని దెబ్బతీస్తుందని ఈ చర్యను దేశమేలు కోరే వారంతా ఐక్యంగా ప్రతిఘటించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి అబ్బాస్ పిలుపునిచ్చారు. వెల్లంకి గ్రామంలో సిపిఎం మండల రాజకీయ శిక్షణ తరగతులు స్థానిక రఘురామ ఫంక్షన్ హాల్‌లో ఉత్సహపూరితంగా ప్రారంభమయ్యాయి. ప్రారంభ సూచికంగా పార్టీ సీనియర్ నాయకులు మేక అశోక్ రెడ్డి పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అమరవీరుల చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు.

ఆర్ఎల్‌డి జిల్లా అధ్యక్షుడిగా నరేందర్‌గౌడ్

ప్రజాపక్షం/హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన డాక్టర్ సోమగాని నరేందర్‌గౌడ్‌ను రాష్ట్రీయ లోక్‌దళ్ (ఆర్ఎల్‌డి) పార్టీ జిల్లా అధ్యక్షునిగా నియమిస్తూ ఆ పార్టీ అధ్యక్షులు కపిలవాయి దిలీప్‌కుమార్ సోమవారం హైద్రాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో నియామకపత్రం అందజేశారు.

25న ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాపక్షం/హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ పట్టణంలోని టౌన్ హాల్‌లో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఈనెల 25న అరైవ్ అండ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్ సర్కిల్ పరిధిలోని లైసన్స్ డ్రైవర్లకు ఉచితంగా కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు సిఐ చరమందరాజు తెలిపారు. సోమవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని సిమెంట్ పరిశ్రమల ట్రాన్స్‌పోర్టు లారీ అసోసియేషన్, ఆటో డ్రైవర్లు, స్కూల్ బస్సు, క్యాబ్ డ్రైవర్లకు ఈ శిబిరంలో అనుభవజ్ఞులైన సీనియర్ కంటి వైద్య నిపుణులతో వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమగు వారికి ఉచితంగా మందులు, కంటి అద్దాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్‌పి కె.నర్సింహా, కోదాడ డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి లు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి డ్రైవర్లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ బండి మోహన్ పాల్గొన్నారు.

అన్నమయ్య భజన మండలి అభినందనలు

ప్రజాపక్షం/హుజూర్‌నగర్: ఇటీవల గడ్డిపల్లి గ్రామంలో జరిగిన జిల్లాస్థాయి భజన పోటీలలో హుజూర్‌నగర్‌కు చెందిన శ్రీఅన్నమయ్య భజన మండలి ప్రథమ బహుమతి, శ్రీగీతాగోవిందం భజన మండలి ద్వితీయ బహుమతి గెలుచుకోవడం జరిగింది. సోమవారం కనకదుర్గ సేవా సమాజం ఆధ్వర్యంలో శ్రీబాచిమంచి చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన సన్మాన సభ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాసగౌడ్, వైస్ చైర్మన్ తన్నీరు మల్లి ఖార్జున్‌రావు హాజరై భజన మండలి సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ దొంతగాని శ్రీనివాసగౌడ్ మాట్లాడుతూ అంతరించిపోతున్న హిందు సనాతన సంప్రదాయ ధర్మాన్ని కాపాడుట కోసం భజన బృందాలు చేస్తున్న సేవచాల గొప్పది అన్నారు. ముందుగా దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ కోతి సంపత్‌రెడ్డి, కౌన్సిలర్లు సైదులు, సులవ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మున్సిపల్ విజయంలో యూత్ కాంగ్రెస్ పాత్ర కీలకం

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులు అత్యధిక సంఖ్యలో విజయం సాధించడంలో యూత్ కాంగ్రెస్ కీలక పాత్ర పోషించిందని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో యూత్ జిల్లాస్థాయి విస్తృత సమావేశం యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ముఖ్య అతిథులుగా హాజరై యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పొన్నం తరుణ్ గౌడ్, జిల్లా ఇంచార్జీలు వెలిమినేటి సురేష్, రమ్యకృష్ణలతో కలిసి మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలతోపాటు మున్సిపల్ ఎన్నికల్లో యూత్ కాంగ్రెస్ నాయకులు పనిచేయాలని సూచించారు. అనంతరం యూత్ కాంగ్రెస్ జిల్లా కమిటి ఆధ్వర్యంలో సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాదిని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ రాష్ట్ర కార్యదర్శి కొమ్ము జవహర్, జిల్లా ఉపాధ్యక్షులు శ్రావ్యారెడ్డి, నాయకులు నవీన్ చారి, కుమార్, విజయ భాస్కర్, కోరుకొప్పుల నరేష్ పాల్గొన్నారు.

పోటీ పరీక్షల్లో ఆంగ్ల భాష ప్రాధాన్యత

ప్రజాపక్షం/రామన్నపేట : స్థానిక రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో పోటీ పరీక్షల్లో ఆంగ్ల భాష ప్రాధాన్యత అను అంశంపై అతిథి ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం ఆంగ్ల అధ్యాపకులు డాక్టర్ సిహెచ్ శ్యాంసుందర్ మాట్లాడుతూ అంతర్జాతీయ భాషయైన ఆంగ్లం ప్రాధాన్యత నేటి సమాజంలో ఎంతో ఉన్నదని, ముఖ్యంగా పోటీ పరీక్షల్లో ఆంగ్ల భాషకు తగిన ప్రాధాన్యత ఉన్నదన్నారు. ఆంగ్లభాషా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ప్రతి విద్యార్థికి ఉన్నదని తెలియజేస్తూ గ్రూప్ చర్చలతో పాటు ఇంటర్వ్యూకు సంబంధించినటువంటి మెలకువలను విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం మాట్లాడుతూ ఆంగ్ల భాషా నైపుణ్యం కలిగి ఉంటే తప్పకుండా ఉద్యోగం సాధించడానికి అవకాశం ఉంటుందని ప్రపంచంలో ఎక్కడైనా ఉపాధిని పొందే సామర్థ్యాన్ని కలిగి ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆంగ్ల విభాగ అధిపతి డాక్టర్ ఎం.లక్ష్మీ నీలిమ, అధ్యాపకురాలు రాధికతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

నాటక పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: వచ్చే నెల 3న పట్టణంలోని కళాభారతిలో బుద్ధునితో నా ప్రయాణం నాటకం డాక్టర్ మువ్వా రామారావు, డాక్టర్ జాడి రాజు నిర్వహణలో అభ్యుదయ ఆర్ట్స్ అకాడమి వారు నాటకానిన నిర్వహించడం జరుగుతుంది. ఈ సందర్భగా నిర్వాహకులు సోమవారం స్థానిక మినా ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ మహమూద్ అలీ పోస్టర్‌ను ఆవిష్కరించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ తన చివరి దశలో బుద్ధుని సిద్ధాంతాలకు ఆకర్షితుడై బౌద్ధంను స్వీకరించడం జరిగిందని, బుద్ధునితో తన కున్న అనుభవాన్ని వివరించడమే ఈ నాటక ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో కస్తూరి ప్రభాకర్ తాళ్లపల్లి రవి, కందుకూరి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు చట్టపరంగా పరిష్కారానికి తక్షణ కృషి

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : ప్రజల సమస్యలు చట్టపరంగా పరిష్కారానికి తక్షణ కృషి చేస్తున్నట్లు జిల్లా ఎస్‌పి కె నరసింహ తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఫిర్యాదుదారుల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు ఫోన్ ద్వారా తక్షణ ఆదేశాలు, సూచనలు చేసి సమస్యల పరిష్కారానికి అవసరమైన దిశానిర్దేశం చేశారు. ప్రజల సమస్యలపై త్వరతిగతిన చట్టపరమైన చర్యలు తీసుకొని బాధితులకు బరోసా కల్పించాలన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా ప్రజలు ఫైరవీలు లేకుండా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా నిర్భయంగా పోలీసు సేవలను వినియోగించుకోవాలని సూచించారు. చట్టబద్ధమైన విధానంలోనే ప్రజలకు న్యాయం జరుగుతుందని, శాంతిభద్రతలను కాపాడుతూ ప్రజలకు మరింత చేరువగా ఉండడమే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమన్నారు.

గ్రామాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తా

ప్రజాపక్షం/మునగాల: గ్రామాభివృద్ధి మీతోనే సాధ్యం అని నాకు అవకాశం కల్పించిన ప్రజలకు నేను ఎల్లప్పుడు మీకు అందుబాటులో ఉంటానని సర్పంచ్ కుంచం ఇందిర నర్సయ్య అన్నారు. సోమవారం మండల పరిధిలోని నర్సింహులగూడెం గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సమస్య లపై పరిశీలించారు. అనంతరం ముస్లీం సోదరుల అంత్యక్రియలకు కబరస్తాన్, శ్మాశన వాటికలో కంపచెట్ల తొలగించకపోవడం, వ్యవసాయ చేలకు వెళ్లే డొంకలు, విద్యుత్ సమస్యలు ఎక్కడికక్కడే పేరుకపోయాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సీతరాములు, మాజీ ఎంపిటిసి విజయలక్ష్మి , మాజీ సర్పంచ్ కొండారెడ్డి, వార్డు సభ్యులు, ప్రజలు, యువకులు పాల్గొన్నారు.

ఈనెల 25న విగ్రహ ప్రతిష్ట

ప్రజాపక్షం/చింతలపాలెం : చింతలపాలెం మండల కేంద్రంలో నూతనంగా నిర్మాణం చేసిన దేవాలయంలో శ్రీలక్ష్మి తిరుపతమ్మ గోపయ్య సమేత అంకమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం ఈనెల 25న అంగరంగ వైభవంగా జరుగనుందని ఉత్సవ కమిటి సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మహోత్సవం సందర్భంగా ఈనెల 24న (నేడు) మంగళవారం రాత్రి 8.10 నిమిషాలకు ముత్యాలమ్మ తల్లి దేవాలయ ప్రాంగణంలో నటరాజ నాట్య కళామండలి, శ్రీశివసాయి నాట్య కళామండలి, ఆనంద భైరవి నాట్య కళామండలి చింతలపాలెం వారిచే శ్రీలక్ష్మి తిరుపతమ్మ జీవిత చరిత్ర పూర్తి నాటక ప్రదర్శన ఉందని వివరించారు.

మహిళ సమాఖ్య భవన నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాపక్షం/మునగాల: మహిళ సమాఖ్య అభివృద్ధికి ఎంతో తోడ్పాటు నందిస్తానని సర్పంచ్ సుంకర పిచ్చయ్య అన్నారు. సోమవారం మండల పరిధిలోని విజయరాఘవపురం గ్రామంలో 10లక్షల వ్యయంతో చేపట్టిన మహిళ సమాఖ్య భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కత్తి వెంకటేశ్వర్లు, జిల్లా కిసాన్ సేల్ అధ్యక్షులు బచ్చు అశోక్, పంచాయతీరాజ్ ఎఇ వసంత, పంచాయతీ కార్యదర్శి ఉపేందర్, వార్డు సభ్యులు సొంపంగు శారధ, సొంపంగు బుచ్చిరాములు పాల్గొన్నారు.

జర్నలిస్టుల అభినందన

ప్రజాపక్షం/కోదాడ : కోదాడ మున్సిపాలిటి ఎన్నికల్లో 30వ వార్డు కౌన్సిలర్‌గా భారీ మెజార్టీతో విజయం సాధించిన కారింగుల అంజన్ గౌడ్ సతీమణి ఉమా అంజన్ గౌడ్‌ను కోదాడ జర్నలిస్టులు అభినందించారు. ఈ సందర్భంగా వారికి పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపి మాట్లాడారు. అంజన్ గౌడ్ జర్నలిస్టుల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ పోరాడిన వ్యక్తి అని ప్రశంసించారు. అదే స్ఫూర్తితో ఉమా అంజన్ గౌడ్ కూడా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ముఖ్యంగా జర్నలిస్టుల సమస్యలను గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేలా చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు సంఘం నాయకులు నారప రాజు హరికిషన్, బంకా వెంకటరత్నం, వంగవీటి శ్రీనివాసరావు, కోట రాంబాబు, బాదె రాము, కొలిచలం నరేష్, పగడాల వాసు, బండి శ్రీను, జూలూరి బసవయ్య, సైదులు, శివ, చరణ్ పాల్గొన్నారు.

తూనం కృష్ణకు సన్మానం

ప్రజాపక్షం/కోదాడ: నన్ను ఆదరించి గెలిపించారు. ఇప్పుడు నా భుజలాపై చాల సమస్యలున్నాయని, వాటిని పరిష్కరించే దిశగా నేను ముందుకు వెళ్తానని 22 వార్డు కౌన్సిలర్ తూనం కృష్ణ అన్నారు. సోమవారం 22వ వార్డు ప్రజలు వార్డు కౌన్సిలర్‌ను ఘనంగా సన్మానించారు. వార్డు అభివృద్ధికి తాను శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో చిట్టెమ్మ, మొలుగూరి సైదులు సునిత, శ్రీనివాసరెడ్డి, జానకిరామయ్య, వెంకటప్పయ్య, తోగరు మధు, ఫణింద్ర, ఉస్మాన్, హనుమంతరావు, పద్మ, కల్పన, శైలజ, సంధ్య, శ్రావణి, గోపి పాల్గొన్నారు.

ఆర్థిక సహకారం

ప్రజాపక్షం/రామన్నపేట : రామన్నపేట మండల పరిధిలోని శోభనాద్రిపురం గ్రామానికి చెందిన బోడిగే నరేష్ గౌడ్ అకాల మరణం చెందగా వారి కుటుంబానికి ఆర్థిక సహాయంగా తన తోటి చదువుకున్న 7వ తరగతి, 10వ తరగతి, ఇంటర్ బ్యాచ్ విద్యార్థులు అందరూ కలిసి రూ.63000 వారి యొక్క పిల్లల పేరు మీద డిపాజిట్ చేశారు.

అవగాహనతోనే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చు

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : అవగాహన, ముందస్తు జాగ్రత్తలతోనే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని జిల్లా అదనపు ఎస్‌పి రవీందర్ రెడ్డి అన్నారు. రాష్ట్ర పోలీసు శాఖ నిర్వహిస్తున్న అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత కార్యక్రమాలలో భాగంగా సోమవారం పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో పట్టణంలోని సాయిగౌతమి కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదం సంభవించడం అంటే ఒక కుటుంబం రోడ్డు పాలవడమన్నారు. ఇలాంటి సంఘటనలు నిత్యం అనేక చోట్లు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. విద్యార్థి దశ నుండే సామాజిక అంశాలపట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ పట్ల విద్యార్థులు అంబాసిడర్స్‌గా ఉండి తల్లిదండ్రులకు చుట్టుపక్కల ఉన్న ప్రజలకు, పెద్దవారికి, నిరక్షరాశులను చైతన్యవంతం చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. పిల్లలు వాహనాలు నడపకూడదని తెలిపారు. పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య మాట్లాడుతూ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించి ప్రమాదాల నిర్మూలనకు నిరంతరం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, రెండవ పట్టణ ఎస్ఐ శివతేజ, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాపక్షం/కోదాడ రూరల్ : మండల పరిధిలోని ద్వారకుంట గ్రామ సమీపంలో సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కారు ముందు టైర్ ఒక్కసారిగా పేలిపోవడంతో అదుపుతప్పి డివైడర్‌ను దాటి ఎదురుగా వెళ్తున్న మరో కారును ఢీకొట్టడంతో ఉప్పెల్లి సత్యంబాబు (54) అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ నుంటి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు ద్వారకుంట గ్రామ సమీపానికి రాగానే ముందు టైరు పేలింది. దీంతో డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోయి డివైడర్ దాటి అవతల లైన్‌లోకి దూసుకెళ్లింది. అదే సమయంలో కోదాడ నుంచి చిమిర్యాల వైపు వెళ్తున్న కారును బలంగా ఢీకొట్టింది. ఢీకొన్న ప్రభావంతో రెండు వాహనాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ప్రమాదం తీవ్రతతో సత్యంబాబు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మృతుడు కోదాడ పట్టణంలోని నయానగర్‌లో ఉంటూ చర్చి పాస్టర్‌గా జీవనం కొనసాగిస్తున్నారు. సత్యంబాబుతోపాటు ఉన్న కారుడ డ్రైవర్‌కు ఒక చెయ్యి, కాలు విరగగా మెరుగైన చికిత్స కోసం కోదాడలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. విజయవాడ నుంచి వస్తున్న కారులో సాయిదుర్గ, స్వప్న, గాయత్రి, మాధవి, నితీష్, మురళీకృష్ణ, దుర్గ భవానీలకు గాయాలు కాగా వారిని చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఘనటా స్థలానికి చేరుకున్న రూరల్ ఎస్ఐ గోపాల్‌రెడ్డి సహాయక చర్యలు చేపట్టి గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంతో రహదారిపై కొంతసేపు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పట్టణాల ప్రగతిలో భాగస్వాములు కావాలి

:ఎమ్మెల్యే జై వీర్ రెడ్డి

ప్రజాపక్షం/హాలియా: హాలియా పట్టణం దినదినాభివృద్ధిలో వ్యాపారుల భాగస్వామ్యం ఎనలేనిదని హాలియా పరిసర ప్రాంతాలు మరింత ప్రగతి సాధించాలంటే అందరి భాగస్వామ్యం అవసరం అని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జై వీర్ రెడ్డి అన్నారు.సోమవారం మండలంలోని కొత్తపల్లి గ్రామం వద్ద నూతనంగా ఏర్పాటుచేసిన వెంచర్ ను ఆయన ప్రారంభించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హాలియా పట్టణ అభివృద్ధిలో తమ తండ్రి మాజీ సీఎల్పీ నేత కుందూరు జానారెడ్డి ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి చేశారని ఆయన వారసత్వాన్ని కొనసాగిస్తూ వచ్చే పదేళ్లలో హాలియాను మరింత అభివృద్ధి చేసేందుకు వ్యాపార,నిర్మాణ సంస్థలు ముందుకు రావాలని కోరారు. ప్రభుత్వం అన్ని అనుమతులు పొందిన తర్వాతనే గేటెడ్ కమ్యూనిటీలు, వెంచర్లు ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఎటువంటి అనుమతులు లేకుండా అధికారులను, ప్రజాప్రతినిధులను ఇబ్బందికి గురి చేయకుండా వ్యాపారులు సహకరించాలన్నారు. ఈకార్యక్రమంలో కొత్తపల్లి గ్రామ సర్పంచ్ బ్రహ్మానంద రెడ్డి,మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి, మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్ర శేఖర్ రెడ్డి,మున్సిపల్ వైస్ చైర్మన్ రాజా రమేష్,కర్నాటి లింగారెడ్డి, కాకునూరి నారాయణ,జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు చిట్టిపోలు యాదగిరి పాల్గొన్నారు.

దౌర్జన్యం చేస్తున్న వారి నుంచి రక్షణ కల్పించాలి

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : నా తండ్రి ద్వారా సంక్రమించిన భూమికి బెస్‌మెంట్ కడుతున్న క్రమంలో పక్క భూమికి చెందిన మాధ వెంకన్న అనే వ్యక్తి మా భూమి పైకి వచ్చి మాపై దౌర్జన్యం చేస్తూ దాడికి పాల్పడ్డాడని, పోలీసులు స్పందించి తనకు రక్షణ కల్పించాలని బాధితురాలు కొంత మమత కోరారు. సోమవారం పట్టణంలోని మానసానగర్ జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు వెంట ఉన్న తన భూమి వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తనకు రక్షణ కల్పించాలని కోరుతూ జిల్లా ఎస్‌పికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సర్వే నంబర్ 798లో తన తండ్రి రాపర్తి చెన్నయ్యకు ఉన్న 605 గజాల భూమిని తనకు పసుపు కుంకుమల కింద ఇవ్వగా అందులో 485 గజాలు రిజిస్ట్రేషన్ అయిందన్నారు. అట్టి భూమిలో తాము హద్దులు ఏర్పాటు చేసుకునేందుకు బెస్‌మెంట్ కడుతుండగా మా భూమి పైకి వచ్చి వారి భూమి నా భూమిలో కలిసిందంటూ నాపై దౌరన్జ్యం చేస్తూ దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై తాను కోర్టు నుంచి ఇంజక్షన్ ఆర్డర్ తెచ్చానని దాన్ని లెక్క చేయకుండా తమ భూమిపైకి వచ్చి తమపై దాడి చేస్తున్నారని తెలిపారు. మాద వెంకన్నకు చెందిన భూమి పక్కనే ఉన్న పోలీసు అధికారి సోమనారాయణ దాంట్లో కలిసిందని ఆ విషయం వెంకన్నకు కూడా తెలుసన్నారు. ఆయన పోలీసు అధికారి కావడంతో ఆయనను అడగలేక తమ భూమిపైకి వచ్చి ఇబ్బందుల పాలు చేస్తున్నాడన్నారు. అతనితో తనకు ప్రాణహాని ఉందని పోలీసులు, అధికారులు స్పందించి తగిన విచారణ చేసి తనకు రక్షణ కల్పించాలని కోరారు.

నల్లగొండ మేయర్‌కు సిపిఐ సన్మానం

ప్రజాపక్షం/నలగొండ టౌన్ : నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి ని సోమవారం సిపిఐ నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకుని సన్మానించారు. సీపీఐ నల్లగొండ నియోజకవర్గ ఇన్‌చార్జి పబ్బు వీరస్వామి మేయర్ నివాసంలో శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా పబ్బు వీరస్వామి మాట్లాడుతూ నగర అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. తాగునీటి సరఫరా నిరంతరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, డ్రైనేజ్, రోడ్లు, పారిశుధ్యం వంటి అంశాల్లో మెరుగైన పనితీరు కనబరచాలని సూచించారు. నగరంలోని అన్ని వర్గాల ప్రజల సమస్యలను సమానంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి విశ్వనాధం,లెనిన్ బాబు,ముండ్ల ముత్యాలు,బసాని వెంకటయ్య పాల్గొన్నారు.

అగ్రకుల అహంకారులను శిక్షించాలి

ప్రజాపక్షం/హాలియా: పసిబిడ్డ అని కూడా చూడకుండా మానవత్వం మరిచి ఆ చిన్నారి హత్యకు కారణమైన అగ్రకుల దురహంకారులను కఠినంగా శిక్షించాలని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను డిమాండ్ చేశారు. సోమవారం హాలియాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నాగర్ కర్నూలు జిల్లా కుమ్మెర గ్రామంలో రెండు నెలల పసిబిడ్డను అత్యంత క్రూరంగా అవమానీయంగా కాలితో తన్ని హత్య చేసిన అగ్రకుల పెత్తందారులైన సతీష్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డిలను సమాజంలో గుర్తుండిపోయేలా కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దైదశీను,ఆకారపు నరేష్,రజక సంఘం నాయకులు రేపల్లె వెంకటేశ్వర్లు,మేకల వెంకన్న,అనుముల అనిల్,నరేష్, ఖమ్మంపాడు సైదులు, అనుముల దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ బెంచీలు బహుకరణ

ప్రజాపక్షం/నలగొండ టౌన్ : ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం పలు సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఎన్‌టిపిఏ డిడిఓ ఏశమల్ల గురువయ్య తెలిపారు.సోమవారం నలగొండ పట్టణంలోని పానగల్ రోడ్డులో గల ఎల్లమ్మ దేవాలయం,శ్రీరామ్ నగర్ కాలనీలోని ఆంజనేయ స్వామి దేవాలయం, అలాగే నలగొండ మండలంలోని చందనపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం,శివాలయం,ఎస్‌సికాలనీలో భక్తులు,గ్రామస్తులు కూర్చునేందుకు సిమెంట్ బెంచీలను బహుకరించారు. భవిష్యత్తులో ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని ఆయన తెలిపారు.

ఇటుక బట్టిలో అనుమానాస్పద మృతి

ప్రజాపక్షం/చివ్వెంల : మండలంలోని వల్లభాపురం గ్రామ శివారులోని ఇటుక బట్టిలో పనిచేసే కార్మికుడు పల్లపు రాజు (35) అనుమానాస్పదంగా మృతి చెందినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మృతిని స్వగ్రామం సూర్యాపేట పట్టణంలోని 4వ వార్డు రాజీవ్‌నగర్‌కు చెందినవాడు. రాజు మరణ వార్త తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకొని మృతిపై పలు అనుమానాలు ఉన్నట్లు ఆరోపించారు. రాజు మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

కఠినంగా శిక్షించాలి

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మర గ్రామంలో రజక జాతికి చెందిన రెండు నెలల పసిపాపని అతికిరాతకంగా చంపిన శ్రీనివాస్ రెడ్డిని వెంటనే కఠినంగా శిక్షించాలని స్వచ్ఛంద సేవ సంస్థ చైర్మన్ మాధగోని రాకేష్ గౌడ్ డిమాండ్ చేశారు. సాయం చేద్దాం వెలుగు నిద్దాం స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నల్లగొండ పట్టణంలోని గడియారం సెంటర్లో నిరసన,ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో సం స్థ ఆర్గనైజర్ రేఖల దిలీప్,ఎగ్జిక్యూటివ్ మేంబర్ బంగారు రవి వర్మ,శివ ప్రసాద్,కృష్ణ, శ్రీకాంత్ సభ్యులు పాల్గొన్నారు.

టోల్‌ప్లాజా వద్ద వాహనాలకు ఉచిత సౌకర్యం కల్పించాలి

ప్రజాపక్షం/బీబీనగర్ : యాదాద్రి టోల్ ప్లాజా యాజమాన్యం బీబీనగర్ పట్టణ వాహనదారులకు ఉచిత సౌకర్యం కల్పించాలని బీబీనగర్ సర్పంచ్ పంజాల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం యాదాద్రి భువనగిరి టోల్ ప్లాజా జిఎం చంద్రమోహన్ కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పట్టణ కేంద్రంలో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని ఎస్బిఐ వద్ద అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని సర్వీస్ రోడ్‌లో పరిశుభ్రత ఏర్పాటు చేయాలని ఎయిమ్స్ నుండి బీబీనగర్ పట్టణం వరకు సర్వీస్ రోడ్లో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట ఉప సర్పంచ్ గోలి నర్సింహారెడ్డి, వార్డు సభ్యులు మంగ అశోక్, నెల్లుట్ల శ్రీశైలం, కట్ట వినోద్, ఆకుల రాజ్యలక్ష్మి రవీందర్, పంజాల ప్రవీణ్, ఉప్పలంచి శ్రీకాంత్, గండు రమేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు

ప్రజాపక్షం/భువనగిరి : ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మునిసిపల్ చైర్ పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్ అన్నారు. భువనగిరి పట్టణంలోని స్థానిక ఇండోర్ స్టేడియంలో అక్రమ నిర్మాణాలకు పాలు పడుతున్న భూమిని భువనగిరి మున్సిపల్ చైర్ పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ భూమిని ఎవరైనా కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఎంఆర్‌వో అంజిరెడ్డి, మునిసిపల్ కమిషనర్ రామలింగం, వార్డ్ కౌన్సిలర్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జెఈఈ మెయిన్స్ టాపర్లను అభినందన

ప్రజాపక్షం/కోదాడ : జెఈఈ మెయిన్స్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో 99.56 పర్సంటైజ్ సాధించిన రేస్ ఐఐటి మెడికల్ అకాడమీ విద్యార్థులు సోమవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే నలమాద పద్మావతి రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయస్థాయి పోటీ పరీక్షల్లో కోదాడ లాంటి పట్టణం నుండి విద్యార్థులు మెరుగైన ర్యాంకులు సాధించడం గర్వకారణనన్నారు. ఈ కళాశాల నుండి పలువురు విద్యార్థులు జెఈఈ మెయిన్స్‌లో ఉత్తమ పర్సంటైజ్ సాధించి ఎన్ఐటి, జెఈఈ అడ్వాన్స్‌డ్‌లో ప్రవేశానికి అర్హత సాధించడం గర్వకారణమన్నారు. జెఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలకు కూడా ఇదే స్ఫూర్తితో సిద్ధమై మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ముక్కా చరణ్ సాయి గౌడ్ (99.56), ఐ కృష్ణ చరణ్ (95.63), సిహెచ్ భాను శంకర్ (94.78) , విజయ్ చరణ్ (92.52), జె ప్రవీణ్ (92.16)లను మార్కులు సాధించిన విద్యార్థులను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల చైర్మన్ బాణాల వసంత వెంకటరెడ్డి, సిరికొండ శ్రీనివాస్, కె శివశంకర్, గద్దె సతీష్, దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

కస్తాలలో ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాపక్షం/చండూరు : నల్లగొండ జిల్లా చండూరు మండలం కస్తాల గ్రామంలో సోమవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కస్తాల గ్రామానికి చెందిన కీర్తి శేషులు బొమ్మరబోయిన మల్లయ్య 5వ వర్ధంతిని పురస్కరించుకొని వారి కుటుంబ సభ్యులు సమాచార హక్కు పరిరక్షణ సమితి , ఎలక్షన్ వాచ్ కమిటీ ఆధ్వర్యంలో నార్కట్‌పల్లి కామినేని హాస్టిటల్ వారి సహకారంతో కస్తాల గ్రామ ప్రజలు చండూరు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు వచ్చి తమ ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ వైద్య శిబిరాన్ని బొమ్మరబోయిన మల్లయ్య సతీమని బొమ్మరబోయిన జయమ్మ ప్రారంభించారు. ఈ శిబిరంలో జనరల్ ఫిజిషియన్ , కంటి వైద్యం, ఎముకలు, దంత పరీక్షలు, నరాల వ్యధి, గుండె సంబంధిత వైద్య నిపుణులు వచ్చి ఉచిత వైద్య పరీక్షలు చేసి అవసరము ఉన్న రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. మరిన్ని వైద్య సేవలు అవసరం ఉన్న వారు కామినేని అసుపత్రి నార్కట్‌పల్లి లో వైద్యం అందిస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో చండూరు మాజీ ఎంపిపి తోకల వెంకన్న , ఎంఈఓ సుధాకర్‌రెడ్డి, చండూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాకట్ర్ గణశ్యామ్ పాల్గొన్నారు.

బడ్జెట్‌లో అభివృద్ధికి తగిన నిధులు కేటాయించాలి

ప్రజాపక్షం/భువనగిరి రూరల్ : మార్చి నెలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టబోయే 2026/27 వార్షిక బడ్జెట్లో యాదాద్రి భువనగిరి జిల్లా సాగు, త్రాగునీరు కోసం, మూసీ జల కాలుష్య నివారణకు, విద్య, వైద్యం, రహదారులు, ఉపాధి, మౌలిక అంశాల అభివృద్ధికి తగిన నిధులు కేటాయించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు యండి జహంగీర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 2026/27 వార్షిక బడ్జెట్‌లో జిల్లా అభివృద్ధికి తగిన నిధులు కేటాయించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కి మెమోరండం ఇచ్చినారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మ, బట్టుపల్లి అనురాధ పాల్గొని మాట్లాడగా, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, దాసరి పాండు, జిల్లా కమిటీ సభ్యులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి, బొలగాని జయరాములు పాల్గొన్నారు.

ఘనంగా సద్గురు సేవా లాల్ మహరాజ్ జయంతి

ప్రజాపక్షం/నకిరేకల్ : పట్టణంలో సద్గురు సంత్ సేవాలాల్ మహరాజ్ 287వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ముఖ్య అతిథిగా హాజరై,ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంజారా సమాజ అభ్యున్నతికి ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ,సమాజంలో ఐక్యత,సేవా భావం, సత్యనిష్ఠ వంటి విలువలను ఆచరిస్తూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ చెవుగోని రజిత,శ్రీనివాస్, సుకన్య,బానోతు వెంకన్న పాల్గొన్నారు.

ఒడి బియ్య ప్రసాదం

ప్రజాపక్షం/నకిరేకల్ : పట్టణంలోని శ్రీ శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో వెంకటేశ్వర దేవాలయం భక్తి బృందం సహకారంతో గీతా పరాయనం నిర్వహించారు.శ్రీశ్రీ ఉమామహేశ్వర స్వామివారి కళ్యాణ ఒడి బియ్య ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో బ్రహ్మంగారి,వెంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్లు మొపూరి చంద్రమౌళి,గుండా వెంకటయ్య,సంకోజు నరసయ్య,సిద్దోడు బిక్షమాచారి, తాటికొండ లక్ష్మయ్య, బహురోజు రాంబ్రహ్మచారి,సంకోజు నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కనకయ్యకు నివాళులర్పించిన సిపిఐ నేతలు

ప్రజాపక్షం/మునుగోడు : మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి,మాజీ జడ్‌పిటిసి నారబోయిన రవి తండ్రి నారబోయిన కనకయ్య అనారోగ్యంతో మృతిచెందారు.ఈనేపథ్యంలో సోమవారం పలువురు సిపిఐ నాయకులు ఆయనకు నివాళులర్పించారు. పల్లా వెంకటరెడ్డి, నెల్లికంటి సత్యం, ఉజ్జిని యాదగిరిరావు, ఉజ్జిని రత్నాకర్ రావులు కనకయ్య మృతదేహంపై పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి,తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బులుగురి నరసింహా, తీర్పారి వెంకటేశ్వర్లు,జిల్లా సమితి సభ్యులు సురిగి చలపతి, మండల కార్యదర్శి శ్రీను,గోస్కొండ లింగయ్య, ఉప్పునూతల రమేష్,కాగిత వెంకన్న పాల్గొని కనకయ్య సేవలను స్మరించారు.

సిపిఐ నాయకుడికి తృటిలో తప్పిన ప్రమాదం

ప్రజాపక్షం/చింతపల్లి : భారత కమ్యూనిస్టు పార్టీ నాయకుడికి తృటిలో రోడ్డు ప్రమాదం తప్పి క్షేమంగా బయటపడిన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. సిపిఐ నల్లగొండ జిల్లా కార్యవర్గ సభ్యుడు, డిండి మండలానికి చెందిన తూం బుచ్చిరెడ్డి తన వ్యక్తిగత అవసరాలరీత్య సోమవారం కారులో దేవరకొండ నుండి హైదరాబాదుకు బయలుదేరాడు. ఈ క్రమంలో చింతపల్లి మండల కేంద్రానికి సమీపంలో భారత్ పెట్రోల్‌బంక్ వద్దకు చేరుకోగానే నాగార్జునాసాగర్‌రహదారిపై ఎదురుగా లారీ వచ్చి ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న బుచ్చిరెడ్డితో పాటు మరో వ్యక్తికి ఎలాంటి గాయాలు కాలేదు. అయితే ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయిందని, ఢీకొట్టిన లారీ తప్పించుకపోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయటం జరిగిందని ఆయన తెలిపారు.

మాదకద్రవ్యాల బారిన పడొద్దు

ప్రజాపక్షం/హాలియా: యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా వారికి అవగాహన కల్పించడంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల పాత్ర కీలకమని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ కాంతయ్య అన్నారు. హాలియా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో గత నాలుగు రోజులుగా మండలంలోని ఇబ్రహీంపేట, పాలెం గ్రామాలలో సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగానే సోమవారం మాదకద్రవ్యాల నిర్మూలనపై ర్యాలీ నినిర్మూలనపై. ఈ సందర్భంగా ప్రోగ్రాం అధికారి డాక్టర్ కాంతయ్య మాట్లాడుతూ గ్రామాలలో యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండేలా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ మాధవి, కవిత, రాజు పాల్గొన్నారు.

దాతల భాగస్వామ్యం అభినందనీయం

ప్రజాపక్షం/పెన్‌పహాడ్ : పాఠశాల అభివృద్ధికి దాతల భాగస్వామ్యం కావడం అభినందనీయమని ప్రధానోపాధ్యాయులు పిండిగ నర్సయ్య, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మామిడి వెంకన్న అన్నారు. సోమవారం మండలంలోని దోసపహాడ్ ప్రాథమికోన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి కొండేటి రాంబాబు నీలమ్మ తండ్రి కీర్తిశేషులు కొండేటి పెద్దవీరస్వామి లక్ష్మమ్మ జ్ఞాపకార్థం పాఠశాల గోడలపై తెలంగాణ తల్లి బొమ్మ, బతుకమ్మ, బోనాల పండుగ బొమ్మలు వేయించడానికి రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

శిక్షణ తరగతులు ఉపయోగం

ప్రజాపక్షం/నకిరేకల్ : గ్రామపంచాయతీ వార్డు సభ్యులకు ప్రభుత్వం అందించే శిక్షణా తరగతులను ఉపయోగకరం వాటిని సద్వినియోగం చేసుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి పెరుమాళ్ళ జ్ఞాన ప్రకాష్ రావు అన్నారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి స్వరూపారాణి,పర్యవేక్షకులు చింతమల్ల చలపతి,టిపోటీలు వెంకన్న ఉన్నారు.

నల్ల బ్యాడ్జీలతో నిరసన

ప్రజాపక్షం/నకిరేకల్ : నాగర్ కర్నూలు జిల్లా పరిధిలో చిన్నారి మృతిక కారకులైన వారిని వెంటనే అరెస్టు చేసి వారిపై ఎస్సీ ఎస్టీ చట్టం కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం నకిరేకల్ పట్టణంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నల్ల బ్యానర్ తో నిరసన నిర్వహించారు.ఈసందర్భంగా వివిధ ప్రజాసంఘాల నాయకులు మాట్లాడారు.ఈకార్యక్రమంలో పివైయల్ రాష్ట్ర నాయకులు ఇందూరు సాగర్,ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి అంబటి చిరంజీవి, జిల్లా కోశాధికారి గజ్జి రవి,కాశీరాం,బొల్లికొండ లింగన్న,కీరన్,యాసరపు శంకర్,చెరుకు ఉపేందర్,విక్కీ రాము,జానపాటి దేవయ్య, ఎశారపు శ్రీకాంత్‌లు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

ప్రజాపక్షం/డిండి : మండలంలోని గోనబోయినపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో సోమవారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో విద్యార్థినీలకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు.ఈ సందర్భంగా హాజరైన ఐసిడిఎస్ సూపర్వైజర్ అనిత మాట్లాడుతూ బేటి బచావో బేటి పడావో కార్యక్రమంలో భాగంగా బాలికల రక్షణ, విద్య యొక్క ప్రాధాన్యత, సోషల్ మీడియా ప్రభావం,వ్యక్తిగత పరిశుభ్రత,బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో అంగన్వాడి టీచర్లు అరుణ,పార్వతమ్మ, ప్రధానోపాధ్యాయులు బ్రహ్మచారి,ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

అసభ్యకర ప్రవర్తన

ప్రజాపక్షం/భువనగిరి రూరల్ : విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి, వారి భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన ఒక ఉపాధ్యాయుడు కామంతో కళ్లుమూసుకుని నీచానికి ఒడిగట్టాడు. యాదాద్రి భువనగిరి జిల్లాలో ఒక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థినిపై ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటన సోమవారం కలకలం రేపింది. విషయం తెలుసుకొని విద్యార్థిని తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకుని ఆందోళన చేపట్టారు. పోలీసులు సదరు ఉపా ధ్యాయుడిని అదుపులోకి తీసుకున్నారు.

మల్లేష్ మృతి బాధాకరం

ప్రజాపక్షం/డిండి : మండలంలోని ఎర్రారం గ్రామానికి చెందిన మావిళ్ళ మల్లేష్ మృతి బాధాకరమని బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు.సోమవారం ఎర్రారం గ్రామంలో మల్లేష్ మృత దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన మల్లేష్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట బిఆర్ఎస్ మండల అధ్యక్షులు రాజీనేని వెంకటేశ్వర్ రావు,నాయకులు వెంకట్రామ్ ఉన్నారు.

సంపూర్ణ మద్య నిషేధానికి గ్రామ సర్పంచి తీర్మానం

ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి : మంచి చదువులు చదివి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకొనే యువత మద్యం ఇతర మాదకద్రవ్యాలకు బారిన పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దనే సంకల్పంతో గ్రామ సర్పంచ్ వార్డ్ మెంబర్లు పెద్దలు కలిసి గ్రామంలో సంపూర్ణ మద్య నిషేధం చేస్తున్నామని సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేసి మంచి మార్పు ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం భీమనపల్లిలో సోమవారం చోటుచేసుకుంది. నూతనంగా ఎన్నికైన సర్పంచ్ వార్డు మెంబర్లు ఎన్నికలలో ఇచ్చిన హామీనీ నెరవేర్చే దిశగా వారు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. గ్రామ ప్రజలు సంపూర్ణ సహకారం అందించి మద్యం జోలికి పోకుండా మద్యం రహిత గ్రామంగా నిలవాలని కోరుకున్నారు. బెల్ట్ షాపుల్లో మద్యం అమ్మే వారికి నోటీసులు ఇచ్చి నిబంధన ఉల్లంఘిస్తే చట్టరీత్య చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



గ్రామ సర్పంచ్ కర్నాటి వరలక్ష్మి , వార్డు మెంబర్లు నర్సిరెడ్డి, శేఖర్, రమణయ్య, సరిత, రాణి, లింగస్వామి, కవిత గ్రామ పెద్దలు, యువకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి

ప్రజాపక్షం/నకిరేకల్ : గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.26వేల ఇవ్వాలని పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు పోన్న అంజయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం సోమవారం మండల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోకు వినతిపత్రం అందించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పంచాయతీ కార్మికులకు ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, అర్హత కలిగిన కార్మికులందరినీ పర్మిట్ చేయాలని, పెండింగ్ వేతనాలను వెంటనే ఇవ్వాలని కార్మికులందరికీ రూ.10 లక్షల రూపాయల పోస్టల్ బీమా సౌకర్యాన్ని గ్రామపంచాయతీలు కల్పించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం సమర్పించిన వారిలో పంచాయతీ కార్మికులు కలిమెర రామలింగయ్య,వేముల అంజయ్య,ఊట్కూరు మల్లికార్జున్, పున్నం రాజు వెంకన్న, బెల్లి లింగయ్య,గద్దపాటి ఎల్లమ్మ,అన్నెపర్తి గిరి,సైదులు,వినోద,రత్నం ఈదయ్య,పార్వతమ్మ ఉన్నారు.

జాతీయ గీతాలాపన కమిటీ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్ల పంపిణీ

ప్రజాపక్షం/త్రిపురారం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ గీతాలాపన కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు.ప్రతిరోజూ ఉదయం 8:30 గంటలకు నిర్వహించే జాతీయ గీతాలాపన కార్యక్రమం అనంతరం ఈ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జాతీయ గీతాలాపన కమిటీ అధ్యక్షుడు బైరంశ్రీనివాస్ మాట్లాడుతూ రాబోయే పదవ తరగతి పరీక్షలను విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో రాసి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి పాఠశాల పేరు ప్రతిష్టలు పెంచాలని సూచించారు.ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ మాట్లాడుతూ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విష్ణుకుమార్, పద్మశ్రీనివాస్, కమిటీ సభ్యులు నగిరి వెంకన్న, అంజి, దస్తగిరి, ఇమామ్, క్యామగిరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజారోహణం

ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి : పోచంపల్లి మండలం కనుముక్కల గ్రామంలో శ్రీశ్రీశ్రీ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం ధ్వజారోహణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గరుడ ఛాయాధివాసం, హవనం, ధ్వజారోహణం మహా నివేదనం సా భేరి పూజ, దేవతాహ్వానం, హోమం, బలిహరణం నిర్వహించారు. ఈనెల 22 నుండి ప్రారంభమైన వార్షికోత్సవాలలో భాగంగా నేడు తిరు కళ్యాణం కనుల పండుగ జరగనుంది. ఈ కళ్యాణానికి ముఖ్యఅతిథిగా టిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఆహ్వానించారు. ఆలయ ఫౌండర్ చైర్మన్ మాజీ జెడ్పిటిసి కోట మల్లారెడ్డి పుష్పలత, ఉత్సవ కమిటీ ధర్మకర్తలు కోట సత్తిరెడ్డి అమృత భక్తులు గ్రామ ప్రజలు పండితులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నిందితులను అరెస్టు చేయాలి

ప్రజాపక్షం/నకిరేకల్ : చిన్నారి హత్యకు కారణమైన అగ్రకుల నేరస్థులపై ఎస్సీ ఎస్టీ చట్టం కింద కేసులు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వంటిపాక కృష్ణ డిమాండ్ చేశారు.సోమవారం నకిరేకల్ పట్టణంలోని ఆసంఘం పట్టణ కమిటీ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలో దళిత వర్గానికి చెందిన చిన్నారి ప్రాణాలు కోల్పోవడం కేవలం ప్రమాదం కాదన్నారు. అగ్రకులానికి చెందిన నేరస్థులందరినీ వెంటనే అరెస్ట్ చేయాలని, బాధిత కుటుంబానికి కనీసం రూ. 25లక్షల పరిహారం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.ఈకార్యక్రమంలో వంటిపాక వెంకటేశ్వర్లు, సాకుంట్ల నరసింహ,వి నాగార్జున,జమదగ్ని,సైదులు,యాదగిరి పాల్గొన్నారు.

సంత్ రవిదాస్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాపక్షం/ఆలేరు : గొప్ప ఆధ్యాత్మికవేత్త, కవి, సంఘసంస్కర్త సంత్ రవిదాస్ యొక్క జయంతిని పురస్కరించుకుని ఆయన పోస్టర్ ఆవిష్కరణ స్థానిక శ్రీ రామకృష్ణ విద్యాలయంలో జరిగింది. సామాజిక సమరసత వేదిక, యాదాద్రి భువనగిరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అఖిలభారత కళాప్రముఖ్ మరియు తెలంగాణ ప్రాంత కన్వీనర్ అప్పాల ప్రసాద్ మాట్లాడుతూ 'కులమతాలు లేవని, పుట్టుకతో ఎవరూ గొప్పవారు కాదని, అందరూ సమానమేనని, చేసే కర్మల వల్ల మాత్రమే గౌరవం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత కళాప్రముఖ్ బండిరాజుల శంకర్, జిల్లా కన్వీనర్ పులమేని అంబేద్కర్, ఆలేరు మోచీ సంఘం అధ్యక్షులు బెదరకోట దుర్గేశ్, సభ్యులు చంద్రగిరి రమేశ్, చంద్రగిరి లింగం పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ : మండలంలోని రామన్నగూడెం గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికుడు గౌని జానయ్య ఇటీవల కాలంలో తాటి చెట్టుపై నుంచి పడి అక్కడికక్కడే మృతి చెందగా అతని కుటుంబానికి ఆసరాగా కౌండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా సంస్థ వారు స్పందించి రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేసినట్లు కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం మృతుని భార్య గౌని సంధ్య, కుమారుడు గోపికి ఆర్థిక సహాయం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ నిరుపేద గౌడ కుటుంబాలను ఎల్లప్పుడూ ఆదుకుంటున్న కౌండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా సంస్థకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మడ్డి అంజిబాబు, గునగంటి కృష్ణ, నోముల వెంకన్న, బోలగాని ఆదిగౌడ్ పాల్గొన్నారు.

మహిళ సమైఖ్య నూతన భవనానికి శంకుస్థాపన

ప్రజాపక్షం/చండూరుః చండూరు మండలం కస్తాల గ్రామానికి నూతనంగా మంజూరైన మహిళా సమైఖ్య భవన నిర్మానానికి సోమవారం గ్రామ సర్పంచ్ లేదన్న సత్యనారాయణ శంకుస్థాపన చేసి భూమి పూజ లో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ కట్ట స్వర్ణ నర్సింహ్మా , వార్డు మెంబర్లు, సిపిఐ సీనియర్ నాయకుడు కట్ట యాదగిరి, సిపిఐ మండల కార్యవర్గ సభ్యుడు గంట రమేష్, గ్రామ శాఖ కార్యదర్శి జోగు రమేష్ పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి అనుగ్రహం పొందాలి

ప్రజాపక్షం/డిండి :ప్రతి ఒక్కరు శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి అనుగ్రహం పొందాలని బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు,మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. సోమవారం డిండి మండలం దాసరినెమిలిపూర్ గ్రామంలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి 39వ,బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ...ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం రవీంద్ర కుమార్‌ను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రాజినేని వెంకటేశ్వర్ రావు, మాజీ వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాష్ పాల్గొన్నారు.

వార్డు సభ్యుల పాత్ర కీలకం

ప్రజాపక్షం/పెన్‌పహాడ్ ః గ్రామాలను అభివృద్ధి చేయడంలో వార్డు సభ్యుల పాత్ర కీలకమని ఎంపిడిఓ జానయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో రెండవ విడత వార్డు సభ్యుల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వార్డుల సమస్యలను సర్పంచ్ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలన్నారు. పచ్చదనం పరిశుభ్రత, మొక్కల పెంపకంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.